## కథ

**ఆమె చాలా బాగుంది... బాగుందని ఎట్లా చెప్పడం! అంత పొడుగు కాదు - పొట్టిగానూ లేదు. మధ్యగా ఉంది. సన్నగా లేదు. మరీ లావూ లేదు. మొత్తానికి ఆరోగ్యంగా వుండి, వొక పట్టపగలు వున్నట్టుండి ఆకాశంలో మబ్బులు అలుముకున్నప్పుడు మిగతా మబ్బులు ఆకాశాన్ని పూర్తిగా కమ్మనప్పుడు సగం ఆకాశం వెండిలా మిగతా సగం చిమ్మచీకటిగా ఉంటుంది. మెరిసే ఆకాశం ఆమె ముఖమైతే రెండో సగం చిక్కటి చీకటిలాగా ఆమె కురులున్నాయి. తనివితీరా స్నానం చేసినట్లుంది, వెంట్రుకలన్నీ దగ్గరగా కుదిర్చి రిబ్బన్ వేసింది. రిబ్బన్‌లో ఇమడలేని కొన్ని వెంట్రుకలు అక్కడక్కడా లేచి గంతులేస్తున్నాయి. నల్లటి చిక్కని మబ్బుల మధ్య మెరుపొచ్చినట్టు లైటు వెలుతురుకు అవి మెరుస్తున్నాయి. ఆకాశం రంగు చీర అదే రంగు జాకెట్ వేసింది. అట్లా ఆమెను దూరాన్నుంచి చూస్తే ఆకాశమంత స్వచ్ఛంగానూ, నిర్మలంగానూ కనిపిస్తుంది.**

కాళ్ళకు వెండి లాగున్న పట్టీలు వాటికి చిన్నచిన్న గజ్జెలున్నాయి. కాలివేళ్ళకు మెట్టెలున్నాయి. చేతులకు మెరిసే గాజులు. ఎడమచేతి మూడో వేలికి ఎర్రగా మెరిసే వొక ఉంగరం. నుదుట ఎర్రటి బొట్టు. తలపాపిట్లో కుంకుమ వున్నాయి. చూడగానే వొక మంచి సాంప్రదాయంగల స్త్రీలాగుంది. ఆమెలో వొక హుందాతనముంది.

ఆమె కెదురుగా చాలా దగ్గరగా వున్న ఇద్దరు మగవాళ్ళతో మాట్లాడుతూ ఉంది. మధ్యమధ్యలో నవ్వుతున్నప్పుడు వజ్రాల పెట్టె తెరిచి మూసినట్లుంది. ఏమీ ఆశించకుండా గంటల తరబడి చూడాలనిపించే అందం ఆమెది. నాజూగ్గా ఆరోగ్యంగా వున్న ఆమె చేతులు ఏ మగాడ్నైనా బంధిస్తే అకారణంగా జీవితం చివరి అంచుల్లో వున్నవాడు కూడా తిరిగొచ్చే అందం ఆమెది.


అక్కడి వాతావరణాన్ని బట్టి చూస్తే ఆమెతో మాట్లాడుతున్న మగవాళ్ళు బంధువుల్లా లేరు. పరిచయస్తుల్లాగున్నారు. అంత మంచి భారతీయ సాంప్రదాయం వుట్టిపడుతున్న ఆమె మగవాళ్ళతో ఎంత సంతోషంగా మాట్లాడగలుగుతుందీ?

అటూఇటూ చూస్తూ కళ్ళు చిలిపిగా చిత్రంగా తిప్పుతూ మాట్లాడుతుంటే మా చిన్నత్తే (మేనత్త) గుర్తుకొస్తుంది. ఆ చిన్ననాటి రోజులు, అనుభూతులు గుర్తుకొచ్చాయి.

నాన్న వొద్దన్నా నన్ను తిర్నాళ్ళకు తీసుకెళ్ళి బొంగులూ, వుట్నాలూ, చిలకులు, చిట్టెకప్పలూ, పిల్లనగోయి, రంగురంగుల చిన్న గడియారం, ఉంగరం ఏదడిగితే అది కొనిచ్చేది. నేను జారుడు బండెక్కి జారుతుంటే లాగు చినికిపోద్దని కొప్పడితే నేను అన్నం తిననని మొండికేసినప్పుడు బుజ్జగించి నన్ను తిట్టినందుకు తనను తాను నిందించుకొని అన్నం తినిపించిన మేనత్త. అదేరోజు తిర్నాళ్ళో తన ప్రియుడ్ని కలిసి 'ఏ గొడవల్లేకుండా పెళ్ళి తొందరగా అయిపోవాలని మొక్కుకున్నాన'ని, నన్ను వొళ్ళో కూర్చోబెట్టుకొని, గట్టిగా కౌగిలించుకొని, ముచ్చట్లు చెప్పే సెలయేరయిన మేనత్త.

ఆరోజు తిర్నాళ్ళ నుంచి ఇంటికి రాగానే వేడినీళ్ళతో నాకు స్నానం చేయించి అత్త తలకు పోసుకుంది. దీపం వెలుగులో ఇద్దరం అద్దం ముందు కూర్చుని పౌడర్ రాసుకున్నాం. ఆరుబయట వెన్నెల్లో మంచాలు వేసింది. అత్త మంచంలో ఇద్దరం ఎదురెదురుగా కూర్చుంటే నాకు తినిపిస్తూ ఆమె తిన్నది. అమ్మా, నాన్న పొలం దగ్గర్నుంచొచ్చి స్నానం చేసి అన్నాలు తిని పడుకున్నారు. చందమామ పెద్దగయి తెల్లగా మెరుస్తుండడంతో చుట్టూ వున్న ప్రదేశమంతా కనిపిస్తుంది. నేను అమ్మ మంచంలో పడుకొని చందమామ ఎటు వెళ్తున్నదీ చూస్తూ దాని పక్కన ఎన్ని చుక్కలుంటాయో లెక్కబెడుతున్నాను. నేను వొకటి... రెండు... పది వరకు లెక్కబెట్టేసరికి చందమామ ముందుకు వెళ్తుంది. నా లెక్క తప్పుతుంది. మళ్ళా లెక్కపెడుతున్నాను.

ఇంతలో అత్త తన మంచంలో పడుకోమని గుసగుసగా పిలుస్తోంది. నాకు ఆశ్చర్యం కలిగింది. రోజంతా ఎంతో ప్రేమతో చూసి



# ఆటో వెళ్ళిపోయింది

**వీరబాబు**

రాత్రికి మాత్రం తన పక్కలో పడుకోనిచ్చేది కాదు మీద కాళ్ళేస్తానని. వొకవేళ గొడవ చేసి పడుకున్నా పొద్దున్నే లేచి చూస్తే అమ్మ మంచంలో వుండేవాడ్ని. తిర్నాళ్ళ నుంచి వొచ్చేటప్పుడు తన పెళ్ళికి తొడుక్కోవడానికి వొకటి దాపుడు కొకటి చొక్కాలాగు కుట్టిస్తానంది. నాకంతా వింతవింతగా అనిపించింది. అత్త రోజూ ఇట్లాగే ఉండాలని మనసులో కోరుకున్నా. నేనట్లా మనసులో అనుకుంటుండగా-

''వొరే చిన్నా రారా'' అని మళ్ళీ గుసగుసగా పిలిచింది.

నేను మెల్లిగా వెళ్ళి అత్త మంచంలో ముడుచుకొని పడుకున్నా.

''నిద్రొస్తుందా?'' అని అడిగింది.

''రావట్లేదు'' అన్నాను.

నా చెయ్యి తీసుకొని తన నడుం చుట్టూ వేసుకుంటూ దగ్గరకు లాక్కొని నన్ను ముద్దులాడుతూ వోణీని కప్పింది. అత్త దగ్గర మంచి వాసనొస్తుంది. వోణీలోంచి ఆకాశంలోకి చూస్తే చందమామ ఎర్రగా కనిపిస్తుంది.

''చిన్నా తిర్నాల బాగుందా?'' అనడిగింది.

బాగుందన్నాను. కొద్దిసేపాగి ''ఆయన బాగున్నాడా?'' అంది.

''ఎవరూ'' అన్నాన్నేను.

''అదేరా మనం కోనేరు దగ్గరకు పోతున్నపుడు మనకెదురొచ్చి నీకు చిలకలు కొనియ్యలేదూ. ఆయన...'' గుసగుసగా చెవిలో అంది.

''ఆ... గుర్తొచ్చిండు''

''మెల్లిగా మాట్లాడు. నాన్న వింటాడు''

''బాగున్నాడా... నీకు నచ్చాడా'' అని మళ్ళీ అడిగింది.

''బాగున్నాడన్నాను''

''నిజంగా చెప్పు బాగున్నాడా...''

''వొట్టు''

''వొట్టు దేవున్తోడు''

''అంత పెద్ద మాటలొద్దు పడుకో'' అని నన్ను దగ్గరకు లాక్కొంది. నేను మీద కాలేసి మరింత గట్టిగా పట్టుకొని పడుకున్నా. మీద కాలేసినందుకు అత్త ఏమీ అననందుకు సంబరపడిపోయి నిద్రపోయాను. అట్లా నన్ను తన ప్రేమతో వుక్కిరిబిక్కిరి చేసిన మేనత్త.

చివరికి తన ప్రియుడు తక్కువ కులం వాడని తిట్టి వేరేవాడ్ని పెళ్ళిచేస్తే కల్లోల సముద్రమైన మేనత్త. ఆనాడు... అత్తవారింటి కెళ్తూ తన ప్రియుడ్ని తలుచుకొని ఎగిసిపడి ఏడుస్తుంటే అది తట్టుకోలేక నేనేడిస్తే ఇంట్లో వాళ్ళంతా ఇంటిమీదా, కుటుంబం మీద ప్రేమని వొదార్చారు. దూడను వొదిలి దాని తల్లిని కొనుక్కొని తీసుకొని పోయినట్టున్న ఆ రోజులు గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళుకమ్మి అంతా చీకటయినట్లనిపించింది.

★★★

ఆమెను చూస్తుంటే గతమంతా గుర్తొచ్చి ఆమెలో అత్త కనిపించి ఇంకా అందంగా, గౌరవంగా, ఆకర్షణతో నా మనసుకు దగ్గరైంది. అట్లా ఆమెనే గమనిస్తూ నిలబడ్డాను.

ఎవరైనా చూస్తారనే భయమే లేకుండా ఎంత స్వేచ్ఛగా మాట్లాడుతుందామె?? బాగా చదువుకున్నది కావొచ్చు. బాగా డబ్బు వున్న కుటుంబంలో పుట్టి వుండొచ్చు. లేకపోతే అంత ధైర్యమెక్కణ్నుంచొస్తుంది? చదువుకొని మంచి ఉద్యోగాలు చేస్తున్న ఆడవాళ్ళు ఇంత స్వేచ్ఛగా వుండరు. పరాయి మగవాడ్ని కనీసం కన్నెత్తైనా చూడరు. మరి ఈమెలో వున్న గొప్ప గుణమేంటి? ధైర్యమా? తెగింపా? ఏమై ఉంటుందీ?

మా అత్తకే ఇంత ధైర్యముంటే తన ప్రియుడితో లేచిపోయుండేది. హాయిగా, సుఖంగా ఎప్పటిలాగే జీవితమంతా సెలయేరులాగుండేది.

ఆమెతో మాట్లాడుతున్న ఇద్దరు మగవాళ్ళు ఏదో అడుగుతున్నారు. తల అడ్డంగా వూపుతూ ఆమె కాదంటుంది. ఆ ఇద్దర్లో ఒకడు డబ్బుతో బలిసినట్టు మత్తుగా వున్నాడు. అతనే వేళ్ళు చూపుతూ ఏదో అంటున్నాడు. ఆమె ముసిముసిగా నవ్వుతూ తల అడ్డంగా వూపుతుంది. మగవాళ్ళిద్దరూ పక్కకు వెళ్ళి చర్చించుకుంటున్నారు. ఇంతలో ఆమె దగ్గరికి ఇద్దరమ్మాయిలొచ్చారు.

వొకమ్మాయి రోజ్‌కలర్ పంజాబీ వేసుకుంది. నల్లటి హైహీల్స్ వేసింది. కుడిచేతికి వాచీ, ఎడమచేతికి రోజ్‌కలర్ గాజులున్నాయి. కళ్ళకింద నల్లటి నీడలున్నా ముఖంలో కళుంది. చలాకీతనముంది.

రెండో అమ్మాయి కొంచెం పొట్టిగా ఉంది. నల్లరంగు మిడ్డీ, ఎర్రరంగు టీషర్ట్ లాంటిది వేసుకుంది. చెప్పులకున్న బంగారపు రంగు డిజైన్ లైటు వెలుతురుకు మెరుస్తుంది. జుట్టును వెనక్కు లాగి పచ్చటి రిబ్బన్ వేసింది. నుదురు మీదకు చిన్న 'ఫంక్' లాగు తీయడంవల్ల చూడగానే ఆకర్షణీయంగానూ, ఎదుటివార్ని ఆకట్టుకోవడం బాగా తెలిసినట్టు కనిపిస్తుంది.

రోజ్‌కలర్ డ్రస్ అమ్మాయి జోకేసినట్టుంది. మిగిలిన ఇద్దరు పగలబడి నవ్వుతున్నారు. మిడ్డీ అమ్మాయి ప్రక్కామె భుజంమీద చెయ్యేసి ఇంకోచేత్తో ఆమెను గట్టిగా పట్టుకొని మరీ నవ్వుతోంది. వాళ్ళట్లా నవ్వుతూ తుళ్ళుతూ వున్నా ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లున్నారు.

ఇంతలో మరో ఇద్దరు యువకులొచ్చారు. బాగా పరిచయమున్న వాళ్ళలాగా మిడ్డీ అమ్మాయిని పిలిచి ఏదో మాట్లాడారు. తర్వాత ఇంకో అమ్మాయి మాట్లాడింది. ఇద్దరూ కలిసి వొచ్చిన యువకులతో వెళ్ళిపోయారు.

మళ్ళీ ఆమె వొక్కతే మిగిలింది. బస్సులు వస్తున్నాయి. వెళ్తున్నాయి. ఏ బస్సు ఎక్కడం లేదామె. షాపులు చాలా వరకు మూసి ఉన్నాయి. పాన్ డబ్బా దగ్గర ఇద్దరూ - మిర్చిబండి దగ్గరా, కట్‌లెట్ బండి దగ్గర కొంతమంది ఉన్నారు. కుడివైపు పల్లీబండి ఉంది. దానిమీద బొగ్గుల పొయ్యిలోంచి ఎర్రటి నిప్పులూ, నిప్పుల మధ్య నుంచి సన్నటి మంటొస్తుంది. ఎడమ వైపునకు కొద్దిదూరంలో రూపియా కి దో... రూపియా కి దో....'' అని పండ్ల బండతను అరుస్తున్నాడు.

ఎడమ ప్రక్కన్నే నలుగురైదుగురు వ్యక్తులూ వాళ్ళ ప్రక్కన్నే రిక్షాలో బీడీ కాలుస్తూ ముగ్గురున్నారు. ఆమె అట్లాగే నిలబడి దిక్కులు చూస్తూ ఉంది. ఆమెను చూస్తూ కొద్దిదూరంలో నేను నిలబడ్డాను. ఏ నంబర్ బస్సెక్కాలో తెలియక నిలబడిందా? ఆమె ఏ మాత్రం కంగారు పడుతున్నట్టూ కనిపించడం లేదు. కొద్దిసేపైన తర్వాత ఇద్దరు వ్యక్తులు స్కూటర్ మీదొచ్చారు. ఆమెకి దగ్గరగా స్కూటరాపి మాట్లాడారు. వాళ్ళు ఏం మాట్లాడింది మిగతా శబ్దాలవల్ల వినిపించలేదు. స్కూటర్ వెనుక కూర్చున్నతను దిగి ఆమెతో ఆటో ఎక్కాడు. స్కూటర్ మీదున్నతను ఆటోను ఫాలో అయ్యాడు.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత ఆమె నిలబడ్డ దగ్గరికి వెళ్ళి వాళ్ళు వెళ్ళిన వైపే చూస్తూ నిల్చున్నాను. నల్లగా, పచ్చటి తొర్రిపండ్ల ముసలోడు బీడీ తాగుతూ ప్రక్క రిక్షాతో ''లం...కు మంచి డబ్బుల బేరం దొరికింది'' అంటున్నాడు.

నాకు విషయం అర్థమైంది. ముందు ఇద్దరమ్మాయిలు వెళ్ళినప్పుడే అనుమానమొచ్చింది. కాని నేనెప్పుడూ అట్లాంటి వాళ్ళని చూడకపోవడం. బయట జనం చెప్పుకునేంత ఎబ్బెట్టుగ లేనందున. నా అనుమానానికి సిగ్గుపడ్డాను.

ఆమెలో వున్న ధైర్యం తెగింపునీ, అత్తనీ, అత్తలో వున్న ఆమెను స్మరించుకుంటూ బస్సెక్కాను. ఇప్పటికీ 'అత్తా', ఆమె గుర్తొస్తూనే ఉన్నారు.

★